ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

మహబూబాబాద్

ఆదివారం 21 జూలై 2024



బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



మల్హర్ మండలం తాడిచర్ల ఓసీపీలోకి చేరిన వరద నీరు


భూపాలపల్లిటౌన్, జూలై 20: భూపాలపల్లి మండలంలోని సింగరేణి ఓపెన్‌కాస్టు 2, 3లలో వర్షం కారణంగా అధికనీరు చేరి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో 6,385 టన్నుల బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. మల్హర్ మండలంలోని తాడిచర్ల బ్లాక్ ఓసీలోకి వర్షం నీరుచేరి 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. మొత్తం బొగ్గు గనులకు సుమారు రూ.4.50 కోట్ల మేరకు నష్టం జరిగి ఉంటుందని సింగరేణి అధికారులు తెలిపారు.



మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం



మహబూబాబాద్ జిల్లా గార్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు



బయ్యారం మండలంలో అలుగుపోస్తున్న బీఎన్.గుప్తా తులారాం ప్రాజెక్టు



కాటారం మండలం గంగపురిలో పెద్దవాగు పొంగి నీట మునిగిన పత్తిపంట



- ముులుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పొంగుతున్న వాగులు
- పలుచోట్ల నీటమునిగిన పంటలు, కూలిన చెట్లు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం.. ఇబ్బంది పడ్డ జనం..
- రామప్ప, లక్నవరం, పాకాల చెరువులకు జలకళ
- గోదావరి నదికి పెరుగుతున్న ప్రవాహం
- బ్యారేజీలకు కొనసాగుతున్న వరద ఉధృతి
- భూపాలపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ఆయా జిల్లాల్లో టోల్‌ఫ్రీ నెంబర్ల ఏర్పాటు

ముసురుకుంది..

• ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వానలు •



20.9 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/ జనగామ (ఆంధ్రజ్యోతి)/ ములుగు/ భూపాలపల్లి టౌన్ / వరంగల్ వ్యవసాయం, జూలై 20: అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. శనివారం రోజంతా ముసురు కమ్మింది. ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురిసింది. దీంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు కొంత అసౌకర్యం ఏర్పడింది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు వరద నీటితో కళకళ లాడుతున్నాయి.

ములుగు జిల్లాలో 30 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వానకు ఈదురుగాలులు తోడవ్వడంతో ఏటూరునాగారం-తాడ్వాయి, తాడ్వాయి-మేడారం ప్రధాన దారిలో చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు స్థానికుల సహకారంతో చెట్లను తొలగించి పునరుద్ధరించారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పదికిపైగా అటవీ గ్రామాలకు రెండురోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలకోసం ఎలిశెట్టిపల్లి, కొండాయి వద్ద మరపడవలను అధికారులు అందుబాటులో ఉంచారు. చెరువులు, కుంటలలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన వృద్ధురాలు మాదరి పోచమ్మకు ఫిట్స్ రాగా మండలకేంద్రంలోని ఆస్పత్రికి తీసుకురావడానికి ప్రయత్నించారు. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎయిర్ బోట్ ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆమెను వాగు దాటించింది. అక్కడ నుంచి ఆమెను 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే భారీ వర్షాలకు బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. జంపన్నవాగుపై కల్వర్టుల వద్ద ఉధృతి ఎక్కువగా ఉండగా ప్రజలు ఎవరూ దాటకుండా పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. 33.6 మీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన లక్నవరం సరస్సులోకి ప్రస్తుతం 19ఫీట్లకు నీరు చేరింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనం అతలాకుతలం అవుతున్నారు. జిల్లాలో సగటు వర్షపాతం 25.8 మిల్లీ మీటర్లు నమోదైంది. భారీ వర్షాలకు పలు చోట్ల చెరువులు, కుంటలకు మత్తడిపోస్తుండగా వాగులు ఉప్పొంగాయి. మహదేవపూర్, పలిమెల ప్రాంతంలోని గోదావరి ఐదు మీటర్ల ఎత్తులో, 3లక్షల 73వేల కూసెక్కుల నీటితో ప్రవహి స్తోంది. మల్హర్, కాటారం మీదుగా వెళ్లే మానేరు నది కూడా వర్షాల కారణంగా ఉప్పొంగింది. కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి మైసమ్మకుంట మత్తడి తెగిపోయింది. తూము దగ్గర బుంగపడటంతో పంటపొలాలు మునిగిపోయాయి. శంకరంపల్లిలో కూలీపనిచేసే శ్రీనివాస్ ఇంటిపైకప్పు కూలిపోయింది. పోతుల వాయి, బొర్రవాగు, గంగారం అలుగువాగు ఉప్పొంగాయి. మల్లారం మిడిచెరువు అలుగు

మిగతా 7వ పేజీలో..

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

- 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కులు

7

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో అధి కారులు అప్రమత్తంగా ఉంటూ. హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్యశాఖ, పంచా యతీరాజ్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహబూబాబాద్ జిల్లాలో రానున్న రెండు, మూడ్రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉం దని, వాతావరణ నిపుణుల సూచనల మేరకు అధి కార యంత్రాంగం అప్రమత్తమై సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల నైనా ఎదుర్కొవడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పాత భవనాలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కుంటలు, చెరువులు, వాగులు ప్రవాహం వద్ద నీటిమట్టం ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయ డం జరిగిందని, ఇందులో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, మునిసిపల్ సిబ్బంది ఉన్నారని ఏదైనా సమస్య వస్తే వారు వెంటనే వెళ్లి పరిష్కరిస్తారని అద్వైత్‌కుమార్‌సింగ్ చెప్పారు. జిల్లాలో ఆస్తి, జంతు, ప్రాణనష్టాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో 13 మంది ఎస్సైలు బదిలీ

మహబూబాబాద్ రూరల్, జూలై 20 : జిల్లాలో 13 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. కేసముద్రం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎం.వంశీధర్ వీఆర్ మహబూబాబాద్‌కు బదిలీ కాగా, డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న జి. మురళీధర్‌రాజును కేసముద్రంగా ఎస్సైగా బదిలీ చేశారు. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికారెడ్డి వీఆర్ మహబూబాబాద్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో డీఎస్‌బీ ఎస్సై ఎస్కే.రియాజ్‌పాషా బదిలీపై వెళ్లారు. నెల్లికుదురు ఎస్సై క్రాంతికిరణ్‌ను వీఆర్ మహబూబాబాద్‌కు బదిలీ కాగా, ఇక్కడ విధులు నిరర్వహిస్తున్న సీహెచ్.రమేష్‌బాబును నెల్లికుదురు ఎస్సైగా బదిలీ చేశారు. గూడూరు ఎస్సై సీహెచ్.నగేష్‌ను మహబూబాబాద్ టౌన్-1 ఎస్సైగా బదిలీ చేయగా తిరుమలాయపాలెం ఎస్సై గిరిధర్‌రెడ్డి గూడూరు ఎస్సైగా బదిలీ అయ్యారు. కొత్తగూడ ఎస్సై వి.దిలీప్‌ను డీఐజీ జోన్-4కు బదిలీ కాగా, ఖమ్మం రూరల్ సెకండ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పోలోజు కుసుమకుమార్ కొత్తగూడ ఎస్సైగా బదిలీ అయ్యారు. డోర్నకల్ -1 ఎస్సై కె.తిరుపతి బయ్యారం ఎస్సైగా బదిలీ కాగా, బయ్యారంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.ఉపేందర్‌ను పెద్దవంగర ఎస్సైగా బదిలీ చేశారు. పెద్దవంగర ఎస్సై బి.మహేష్‌ను వీఆర్ ఖమ్మంకు బదిలీ చేశారు.

రేపటి నుంచి హైస్కూల్ టైమింగ్స్‌లో మార్పు : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 20 : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. దీనికి సంబంధించిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనెల 22 నుంచి ప్రభుత్వం కొత్తగా కేటాయించిన సమయపాలన ప్రకారం హైస్కూల్స్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని అన్ని పాఠశాలల హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- గుడుంబా, నల్లబెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు
- రూ.12 లక్షల ఎండు గంజాయి స్వాధీనం
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

తొర్రూరు, జూలై 20 : గంజాయి, అంబర్, పాన్‌మసాలా వంటి మాదక ద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్‌కేకన్ హెచ్చరించారు. శనివారం తొర్రూరులో అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల ఎండు గంజాయిని పోలీస్‌లు తనిఖీలు చేస్తూ పట్టుకున్న నేపథ్యంలో పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల రవాణాను నియంత్రించడానికి దాడులు తీవ్రతరం చేశామన్నారు. జిల్లాలో వారంలో రెండు, రోజుల పాటు గుడుంబాకేంద్రాలు, నల్లబెల్లం విక్రయాలు చేపడుతున్నవారిపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఆంధ్రాలోని సీలేరు నుంచి బొలెరో ఏపీ39జి 3761 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 33 ప్యాకెట్లలో 60 కేజీల గంజాయి తరలిస్తుండగా సమాచారం మేరకు తనిఖీలు చేసి తొర్రూరు సీఐ సంజీవ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారన్నారు. దీని విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందన్నారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రహల్లాద్ సీసా, ఎ.భైరాగితో పాటు మరో ఇద్దరు మహిళలు బి.పంగి, సీతం సీసాలు బొలెరో వాహనంలో కుటుంబ సభ్యులుగా ప్రయాణం చేస్తూ ఆంధ్రాలోని సీలేరు నుంచి తెలంగాణకు తరలిస్తున్న ఎండు గంజాయిని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ నిషేధిత గుడుంబా, నల్లబెల్లం, పటిక విక్రయాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ వెల్లడించారు. జాతీయ రహదారులపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని గుర్తించి సంబంధిత అధికారులు రిపేర్‌లు చేపట్టాలన్నారు, జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున అత్యవసర సమయాల్లోనే ప్రజలు బయటికి రావాలని, ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలపాలన్నారు. గంజాయి రవాణాను చాకచక్యంగా పట్టుకున్న తొర్రూరు పోలీసులను ఎస్పీ అభినందించారు. సీఐ సంజీవ్, ఎస్సైలు జగదీష్, రాజు, క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

దాశరథి చరిత్రను భావితరాలకు తెలియచేయాలి

- రేపటి నుంచి ఏడాది పాటు దాశరథి జయంతి ఉత్సవాలు
- చిన్నగూడూరులో ఆయన విగ్రహానికి నివాళులు, మానుకోటలో సభ
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, జూలై 20 : నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన మానుకోట మట్టి బిడ్డ మహాకవి దాశరథిని సమాజం మరువద్దని.. ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేయాలని ఎమ్మెల్సీ, దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. మానుకోట జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను సోమవారం జిల్లాలో ఘనంగా ప్రారంభిస్తామని, ఇవి ఏడాది పాటు జరుపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈనెల 22న ఉదయం 9 గంటలకు దాశరథి జన్మస్థలం చిన్నగూడూరు మండల కేంద్రంలోని దాశరథి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అక్కడి నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి బైక్‌ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో శతజయంతి ఉత్సవసభ జరుగుతుందని, అనంతరం సాహితి గోష్ఠి ఉంటుందన్నారు. దీనికి ముఖ్యఅతిథిలుగా ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి, ఐజేయూ అనుబంధ టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ వస్తున్నారన్నారు. సాహితి ప్రియులు, కవులు పెద్దఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మానుకోట ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి..

మహాకవి దాశరథి ఈ ప్రాంత ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. నిజాం నిరంకుశ పాలనను తన కలం ద్వారా ఎదురించి నిజామాబాద్ జైలుకు వెళ్లిన దాశరథి అక్కడ గోడలపై బొగ్గు ముక్కతో ఓనిజాం పిశాచమా అని రాసిన ధైర్యశాలి అని చెప్పారు. తన రచనలు, కవితల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన దాశరథి ఈ ప్రాంతంలో పుట్టడం మన అదృష్టంగా భావించాలన్నారు. అలాంటి మహనీయుడిని ఏడాది పాటు స్మరించుకుని ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేసి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో దాశరథి కాంస్య విగ్రహం, స్మృతి వనం, కళాక్షేత్రం ఏర్పాటుకు సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, దాశరథి శత జయంతి ఉత్సవ మండల కమిటీ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ , కౌన్సిలర్ ఎడ్ల వేణు, బీఆర్ఎస్ నాయకులు బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, పుచ్చకాయల రామకృష్ణ, డౌలాగర్ శంకర్, శివ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే మోదీ లక్ష్యం

- తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ సర్కారు మోసం
- 2029లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం
- ఆదిలాబాద్ ఎంపీ నగేష్

మహబూబాబాద్ రూరల్, జూలై20 : దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మోదీ అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య నివాసంలో శనివారం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఎంపీను సన్మానించి, వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో మోదీ సమర్థతతోనే సుస్థిర పాలన అందించారని చెప్పారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, ప్రతిపక్షాలు విష ప్రచారం చేశాయని దీంతో కమలం పార్టీకి కొంత నష్టం జరిగిందని పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, ఏ ఒక్క గ్యారంటీని కూడ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు.

రుణమాఫీ కూడా అర్హులైన రైతులందరికి మాఫీ కాలేదని ఆరోపించారు. 2029 జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఇప్పటి నుంచే బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, పొడుగు నర్సయ్య, వాసం నాగేశ్వర్‌రావు, రమేష్, చుక్కల నరేష్, మారగాని రాజు తదితరులు పాల్గొన్నారు.



గార్లలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

గార్ల, జూలై 20 : సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి, రైతులకు సాగునీరందించాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్ల మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నీటిని మొదటగా ఏజెన్సీ మండలాల్లోని రైతులకు ఉపయోగపడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసి, నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. మండల ప్రజలు కోరినట్టుగా గార్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదలకు రైల్వేమంత్రితో చర్చించి, స్టేషన్ ఆధునీకరణకు నిధులు మంజూరుకు కృషి చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో విమల్‌కుమార్ జైన్, గుండెబోయిన నాగమణి, జంపాల శ్రీను, నాగరాజు, జశ్వత్ ఠాకూర్, దేవానాయక్, అజ్మీరా సుమలత, అజ్మీరా రామునాయక్, బుచ్చిబాబు, నేలం నాగేంద్రబాబు, వినతిపత్రం సమర్పించిన వారిలో కందునూరి ఈశ్వర్‌లింగం పాల్గొన్నారు.



రుణమాఫీ ప్రక్రియను పర్యవేక్షించండి..

బ్యాంకు అధికారులతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 20: రుణమాఫీ ప్రయోజనాలు సంపూర్ణం అయ్యేలా నిత్య పర్యవేక్షణ జరపాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులను ఆదేశించారు. శనివారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుఅధికారులు, సహకార సంఘాల ప్రతినిధులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రుణమాఫీప్రక్రియ అమలు, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం, సమస్యలు, పరిష్కార చర్యలు తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు రవీందర్‌రావు దిశా, నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం చారిత్రక ఘటమన్నారు. రైతులకు ఖాతాల్లో జమ అయ్యే చర్యలు వేగవంతం చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాక ఇతర ఖాతాల కింద ఆ డబ్బులను తీసుకోవద్దని సూచించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి కారణాలు విశ్లేషించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


సమీక్ష నిర్వహణలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రైతులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా సేవలు అందించాలన్నారు. రుణమాఫీ నివేదికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకొని తనకు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీసీసీ బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, కృష్ణమోహన్, గంప స్రవంతి, రాజు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మార్నేని

రుణమాఫీ ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలియచేశారు. శనివారం హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. రుణమాఫీ ద్వారా రైతులకు న్యాయం చేశారంటూ నరేందర్‌రెడ్డిని టెస్కాబ్ చైర్మన్ అభినందించారు.

పాఠశాల పనివేళల్లో
స్వల్పమార్పులు

ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

లింగాలఘణపురం, జూలై20: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పులు చేస్తూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూళ్ల పనివేళలు ఇప్పటిదాకా వేర్వేరుగా కొనసాగుతున్నాయి. కాగా అన్ని పాఠశాలల సమయాలను ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు ఒకే రకంగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో హైస్కూళ్లు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, ప్రాథమిక పాఠశాలలు 9.00 గంటల నుంచి 4.00 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతుండేవి. ప్రస్తుతం అన్ని పాఠశాలలకు ఒకే సమయాన్ని నిర్ణయించారు. అయితే ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో మాత్రం ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించేలా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి. వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఆకాశవాణిలో వెంకయ్యనాయుడితో కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, జూలై 20: తెలుగు పద్మాలు ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు వరంగల్ ఆకాశవాణితో పాటు రెండు తెలుగు ఉభయ రాష్ట్రాల్లోని అన్ని రేడియో కేంద్రాల నుంచి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పరియచ కార్యక్రమం ప్రసారం చేయనున్నామని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేడియోతో మాజీ ఉపరాష్ట్రపతికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తారని తెలిపారు. ఆకాశవాణి విశ్రాంత ఏడీజీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు పరిచయకర్తగా వ్యవహరిస్తారన్నారు. శ్రోతులు తప్పకుండా వెంకయ్యనాయుడు పరియక కార్యక్రమం వినాలని రవికుమార్ కోరారు.

28 నుంచి అమరవీరుల
సంస్మరణ వారోత్సవాలు

కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడిద్దాం..

భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ నేత ఆజాద్

మహబూబాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3 వరకు ప్రజాపోరాటాల్లో అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుందామని భారతకమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరిసీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే. ఏఎస్ఆర్) నాయకుడు ఆజాద్ పిలుపు నిచ్చారు. మావోయిస్టు నేత ఆజాద్ పేరిట మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి శనివారం పంపిన పత్రిక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. దేశంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి నేటి వరకు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం 50 ఏళ్ల ప్రజా యుద్ధం కొనసాగుతుందని చెప్పారు. ఈ పోరాటంలో చారుమజుందార్, కనాయ్‌చటర్జీ అమరులయ్యారని వారి విప్లవోద్యమాన్ని పురోగమిస్తూ అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారని చెప్పారు. గతేడాది ప్రభుత్వ ఘాతుక చర్యల్లో 194 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం

ఏటా జూలై 28న అమరుల దినోత్సవాన్ని జరుపుకుంటామని, పోరాటాల్లో వీర మరణం పొందిన వారికి జోహార్లు అర్పిస్తూ వారి ఆశయసాధన కోసం పునరంకితమవ్వాలని ఆజాద్ అన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ 2047 వరకు బ్రహ్మణీయ హిందూ రాజ్యం నిర్మించే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, కార్పొరేట్‌ల ప్రయోజనాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా ప్రచారాలతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిబంధనలను సరళతరం చేసిందని ఆరోపించారు. దేశ సంపదను దోచుకునేలా వందకు పైగా చట్టాలను సవరించిందని మండిపడ్డారు. అంబానీ, ఆదానీలు లాభాలు పొందడానికి అనేక ఒప్పందాలు కుదుర్చుకుందని విమర్శించారు. దశాబ్దాల పోరాటం తర్వాత సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కనీస ప్రజాస్వామ్యత హక్కులు కూడా లేవన్నారు. నయవంచనకు గురిచేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు అధికారంలో నుంచి దించి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, వారు ఆరునెలల్లో అవినీతి, అక్రమాలు, బ్రహ్మణీయ హిందూత్వంపై పోరాడుతున్న వారిపై దాడులు చేశారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కేంద్రప్రభుత్వం కలిసి ఎన్‌కౌంటర్లు, అక్రమ కేసుల్లో అమాయకులను అరెస్టు చేస్తుందని ఆజాద్ పేర్కొన్నారు. 2017లో సమాధాన్, 2022లో సూరజ్‌కుండ్ విఫలమయ్యాయని, 2024 జనవరి నుంచి కగార్ ఆపరేషన్ పేరుతో క్రూరమైన దాడులు ప్రారంభించారన్నారు. దానిని ప్రజాఉద్యమాలతో ఓడిద్దామని పిలుపు నిచ్చారు.



బాలికపై అత్యాచారయత్నం

నిందితుడిపై ఫోక్సో కేసు

వరంగల్ క్రైం, జూలై 20: వరంగల్ నగరంలో దారుణం చోటుచేసుకుంది ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచార యత్నం చేశాడు. ఈ సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో బుధవారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన తల్లికి ఫోన్ చేయాలని ఇంటి సమీపంలో ఉండే సుమన్ అనే యువకుడి వద్దకు వెళ్లిన బాలికను లోపలికి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. చేసే బాలిక ప్రతిఘటించి యువకుడి చేతిని కొరికి బయటికి పరుగెత్తుకొచ్చింది. అనంతరం విషయాన్ని తన తల్లికి సమాచారం ఇచ్చింది. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడు సుమన్‌పై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవీందర్ ధ్రువీకరించారు.







రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

76 మంది ఉద్యోగులు స్థాన చలనం

రాంనగర్, జూలై 20: రిజిస్ట్రేషన్ శాఖలో 76 మంది ఉద్యోగులను (సీనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ వరకు) బదిలీ అయ్యారు. అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు జిల్లా రిజిస్ట్రార్ రవి, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 13 మంది సీనియర్ అసిస్టెంట్లు, 38 మంది జూనియర్ అసిస్టెంట్లు, 20 మంది అటెండర్లు, 4 క్యాషియర్లు, 1 టైపిస్టు ఉన్నారు. కాగా సీనియర్ అసిస్టెంట్లు అందరు ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా, అక్కడి నుంచి 13మంది వరంగల్‌కు వస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ వరకు బదిలీ అయిన వారు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 15 కార్యాలయాలకు కేటాయించబడ్డారు. సీనియర్ అసిస్టెంట్లు పొరుగు జిల్లాకు బదిలీ అయ్యారు.

రెవెన్యూశాఖలో...

హనుమకొండ టౌన్: స్పౌజ్, ప్రత్యేక కారణాలతో దరఖాస్తులు చేసుకున్న మల్టీజోన్-1, జోన్-4 పరిధిలో ఉన్న తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మంలో పనిచేస్తున్న తహసీల్దార్ టి. గౌరిశంకర్‌ను హనుమకొండ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా జోనల్-4 పరిధిలో వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యం. రమేశ్‌ను హనుమకొండకు, మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జి. అనురాధను హనుమకొండ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నలుగురు డిప్యూటీ తహసీల్దార్‌లు బదిలీ

నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నలుగురు డిప్యూటీ తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఎ. లలిత స్పెషల్ కలెక్టర్ ఎల్ఏ వరంగల్ నుంచి యుఎల్‌సీ వింగ్ హనుమకొండ కలెక్టర్‌కు, బి.సంగీత ఆత్మకూరు మండల ఆఫీస్ నుంచి హనుమకొండ కలెక్టర్ యుఎల్‌సీ వింగ్‌కు, ఎల్.భాస్కర్ మూర్తి హనుమకొండ కలెక్టరేట్ యుఎల్‌సీ వింగ్ నుంచి ఆత్మకూరు తహసీల్దార్ ఆఫీస్‌కు, కె.సూర్యనారాయణ కలెక్టరేట్ యుఎల్‌సీ వింగ్ హనుమకొండ నుంచి స్పెషల్ కలెక్టర్ ఎల్ఏ వరంగల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బల్దియా పరిధిలో పలువురికి బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 20: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఒకే చోట చాలా కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ అధికారి వీపీ గౌతమ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.


శానిటరీ ఇన్‌స్పెక్టర్ల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
పి. సురేష్	వరంగల్ బల్దియా	పరకాల
జె. భీమయ్య నాయక్	వరంగల్ బల్దియా	ఖమ్మం
గోల్కొండ శ్రీను	వరంగల్ బల్దియా	ఖమ్మం
ఎస్. కరుణాకర్	వరంగల్ బల్దియా	మహబూబాబాద్
శానిటరీ సూపర్‌వైజర్‌ల విభాగంలో..		
మాదాసి సాంబయ్య	వరంగల్ బల్దియా	ఖమ్మం
హెల్త్ అసిస్టెంట్ల విభాగంలో...		
సెగ్గోజు కిరణ్‌కుమార్	వరంగల్ బల్దియా	పరకాల
ఈశ్రం శ్రీను	వరంగల్ బల్దియా	నర్సంపేట
రామ శ్రీధర్	వరంగల్ బల్దియా	మహబూబబాద్
ఎస్. ఎల్లస్వామి	వరంగల్ బల్దియా	ఖమ్మం
గోనెల రవీందర్	వరంగల్ బల్దియా	పాల్వంచ
బి. సంపత్‌కుమార్	వరంగల్ బల్దియా	ఇల్లందు
గద్దల శివకుమార్	వరంగల్ బల్దియా	ఇల్లందు
ఎస్. శ్యాంకుమార్	వరంగల్ బల్దియా	మణుగూరు
సీనియర్ అసిస్టెంట్ల విభాగంలో...		
ఇజ్రాయెల్	వరంగల్ బల్దియా	ఖమ్మం

నాలుగో తరగతి ఉద్యోగుల బదిలీలకు బ్రేక్

వరంగల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న నాలుగో తరగతి ఉద్యోగుల బదిలీల ప్రక్రియను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తిరిగి బదిలీల ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు.





ముసురుకుంది..

(5వ పేజీ తరువాయి)

వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మొగుళ్లపల్లి, టేకుమట్ల ప్రాంతాల్లో పలుచోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

● జనగామ జిల్లా అంతటా శనివారం ముసురేసింది. జిల్లాలో పంటకు సరిపడా వర్షాలు ఇప్పటికీ పడలేదు. ఈ తరుణంలో 24 గంటలుగా ముసురు పడడంతో పత్తి పంటకు కొంత ఊరట కల్గినట్టయింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు కారణంగా జిల్లాలోని పాత ఇళ్లకు ప్రమాదం ఏర్పడుతోంది. ఏకధాటిగా కురుస్తున్న ముసురుతో నర్మెట్టలో ఓ పాత ఇంటి గోడ కూలింది. జిల్లా అంతటా శనివారం ముసురుతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా శనివారం 7.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా పాలకుర్తి మండలం వావిలాలలో 13.8 మి.మీ, అత్యల్పలంగా నర్మెట్టలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

● మహబూబాబాద్ జిల్లాలో రెండ్రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి పలు మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. గార్ల పాకాల వాగు రాంపురం బ్రిడ్జిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాబోయే రెండు, మూడ్రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం సెల్-7995074803 నెంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ 8712656928 నెంబర్‌తో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రజలు అత్యవసర సమయాల్లో ఈ నెంబర్లకు ఫోన్ చేసి సహాయం తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ కోరారు. గార్ల పాకాల వాగు పొంగుతుండడంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో వాగును పరిశీలించి బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు బంద్ చేశారు. వాగు పొంగుతుండడంతో రాంపురం, మద్దివంచ, కొత్తతండా, పులిగట్టుతండా, గొల్లచర్ల, రాముతండా, హన్యతండాతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కొత్తగూడ మండలంలో కత్తెర్లవాగు, భూర్కపల్లి, కొత్తపల్లి వాగులు ప్రవహిస్తున్నాయి. బయ్యారంలో పెద్దచెరువు, గౌరారం కట్టు, తులారం ప్రాజెక్టు అలుగులు పోస్తున్నాయి. పాండవుల గుట్ట జలపాతం జాలువారుతుండడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గూడూరు మండలంలోని భీమునిపాదం జలపాతం జాలువారుతుండడంతో ఇతర జిల్లాల నుంచి పర్యాటకుల సందడి పెరిగింది.

● హనుమకొండ జిల్లాలో మాత్రం ఒక మోస్తరుగా మాత్రమే కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భారీ వర్షాలు పడలేదు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక చేసినప్పటికీ జిల్లాలో భారీగా వర్షాలు కురవలేదు. రెండు మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటోంది. రాత్రంతా ముసురు పడుతోంది. పగలు వర్షం జాడలు లేవు. జిల్లాలో గత 24 గంటల్లో సరాసరి 16.3 మి.మీ. వర్షపాతం మాత్రమే రికార్డయింది. ఆత్మకూరు, దామెర, కమలాపూర్, హసన్‌పర్తి మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో జల్లులు మాత్రమే పడ్డాయి. పరకాలలో లోటు వర్షపాతం నమోదైంది. తొమ్మిది మండలాల్లో ఇప్పటి సాధారణ వర్షపాతం మాత్రమే రికార్డయింది. భీమదేవరపల్లి, వేలేరు, ఎల్కతుర్తి, ఆత్మకూరు మండలాల్లో మాత్రమే సాధారణం కన్నా కాస్త ఎక్కువ వర్షం పడింది. భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి పెద్దగా నీరు చేరలేదు. ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా వరినాట్లు ఊపందుకున్నాయి. తుంపర్లు పడుతుండడంతో నేలతడిసి నాట్లకు అనుకూలంగా ఉండడంతో వరి స్వల్పకాలిక రకాలను రైతులు నాటుతున్నారు. బావుల కింద మాత్రం రైతులు దీర్ఘకాలిక రకాలను అప్పటికే వేశారు. సాధారణంకన్నా మించి వర్షం కురవకపోవడంతో వరి, పత్తి సాగులో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 25శాతం మేరకే వరి నాట్లు పడ్డాయి.

● వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకు సాధారణం కన్నా 10 నుంచి 15 శాతం మేరకు అధిక వర్షపాతం రికార్డు కావలసి ఉండింది. కానీ సాధారణ వర్షమే పడింది. దీనితో జిల్లాలో చెరువులు, కుంటలు, బావుల్లోకి చాలినంత నీరు చేరలేదు. మూడు రోజులుగా ముసురుపడుతోంది. భారీ వర్షం జాడే లేదు. గురువారం ఒక్క రోజే ఒక మోస్తరు భారీ వర్షం పడింది. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 22 నుంచి 25 మి.మీ. వర్షమే పడింది. దాదాపు అన్నిమండలాల్లో ఇప్పటి వరకు సాధారణ వర్షమే కురిసింది. పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్న దృష్ట్యా వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ను ఇచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు కురిసిన పక్షంలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను అలర్ట్ చేశారు.



మంగపేట మండలం కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెరుగుతున్న గోదావరి ఉధృతి

మహదేవపూర్/మంగపేట/ఏటూరునాగారం/వాజేడు,జూలై 20: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా భూపాలపల్లి, ములుగు జిల్లాలో గోదావరి ప్రవాహం పెరిగింది. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, ముక్తీశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమేణా పెరుగుతోంది. సరస్వతి బ్యారేజీ వద్ద గేట్లు తీయడంతో వరద నీరు ఎక్కువ రావడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మానేరువాగు, వంకల నుంచి పెద్ద ఎత్తున గోదావరిలోకి పెద్ద ఎత్తున వరద చేరుతోంది. శనివారం సాయంత్రం వరకు 8.32 మీటర్ల ఎత్తులో ప్రవాహం నమోదైంది.



మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి వరదపోటుతో కోతకు గురవుతున్న వ్యవసాయ భూములు

మంగపేట మండలంలో..

భారీ వర్షాలకు మంగపేట మండలంలోని వాగులు, వంకలు, ఒర్రెలు, ఇతర జలపాతాల నుంచి వరద నీరు గోదావరిలో కలుస్తోంది. దీంతో శనివారం ఉదయం 8.02 మీటర్ల ప్రవాహం నమోదైంది. సాయంత్రం వరకు రెండు సెంటీ మీటర్లవరకు తగ్గుతూ వచ్చింది. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద సాయంత్రం వరకు 8 మీటర్ల దూరం వరకు వరద ప్రవాహం కనిపించింది. ఎగువ ప్రాంతాల్లో బ్యారేజీల వద్ద నీటిని విడుదల చేసినప్పుడు వరద పెరగడం, గేట్లు మూసినప్పుడు తగ్గడం జరుగుతోందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. గోదావరి పెరిగినప్పుడు కమలాపురం, మంగపేట మధ్య వరద పోటుతో వ్యవసాయ భూములు కోతకు గురవుతూ విలువైన భూములు వరదలో కలుస్తున్నాయి.

ఏటూరునాగారం మండలంలో..

భారీ వర్షాలకు తోడు మండలంలోని తుపాకులగూడెంలోని సమ్మక్క - సారలమ్మ గేట్లన్నీ ఎత్తడంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. శనివారం ఉదయం 7గంటలకు 11.730 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నానికి 11.970 మీటర్లకు చేరింది. సాయంత్రం 6 గంటలకు 12.210 మీటర్లకు నీటిమట్టం చేరింది. కాగా పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 14.830 మీటర్లకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

పేరూరు వద్ద..

మండలంలోని పేరూరు వద్ద గోదావరి వేగంగా పెరుగుతోంది. ఎగువున ఉన్న ఇంద్రావతి, సమ్మక్కసాగర్ బ్యారేజీల నుంచి వరద నీరును దిగువకు విడుదల చేస్తుండటంతో గోదావరికి భారీగా వరద నీరు చేరుతోంది. శనివారం ఉదయం 8గంటలకు 12.850 మీటర్ల నీటిమట్టంతో ఉన్న గోదావరి 10 గంటలకు 12.870 మీటర్లు నమోదైంది. మధ్యాహ్నం 1గంటకు 12.880 మీటర్లు, సాయంత్రం 6గంటలకు 13.240 మీటర్లకు చేరుకుంది.

బ్యారేజీలకు కొనసాగుతున్న వరద నీరు

● మేడిగడ్డ బ్యారేజీకి 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్/కన్నాయిగూడెం, జూలై 20: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీకి ఎగువన వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. శుక్రవారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3.10లక్షల క్యూసెక్కులుగా ఉండగా శనివారం సాయంత్రం వరకు 3.73లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బ్యారేజీ 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. శనివారం బ్యారేజీ వద్ద 5 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీ 66 గేట్లను ఎత్తి అంతేనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నీటినిల్వ చేయడం లేదని అధికారులు చెబుతున్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం



సమ్మక్కసాగర్ బ్యారేజీలోకి వస్తున్న వరద నీరు

సమ్మక్క బ్యారేజీలో..

భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని సమక్కసాగర్ బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో బ్యారేలోని మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 79.50 మీటర్లు నీటి ప్రవాహం నమోదైంది.

కురుస్తున్న రామప్ప దేవాలయం



రామప్ప దేవాలయంలో సజ్జల్ స్టోన్ నుంచి కారుతున్న వర్షపు చుక్కలు

వెంకటాపూర్(రామప్ప), జూలై 20: ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం కురుస్తోంది. తూర్పు, దక్షణం వైపున స్తంభాల నుంచి వర్షం నీరు చుక్కలుగా కారుతోంది. పైకప్పుపై సజ్జల్ స్టోన్‌గా పిలిచే రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి నీరు కారుతున్నట్లు స్పష్టమవుతోంది. ఆలయ సందర్శనకు వస్తున్న పర్యాటకులు ఈ దృశ్యాలను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2022 జూలైలో కూడా భారీ వర్షాలకు ఇదే రీతిన ఆలయం కురిసింది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పురావస్తుశాఖ అధికారులు హుటాహుటిన రామప్పకు వచ్చి పరిశీలన జరిపారు. నక్షత్రాకార పీఠంపై విచ్చుకున్నట్లుగా నిర్మితమైన ఆలయం పైకప్పు శిథిలం కాలేదని, రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి చుక్కలుగా నీరు కారుతోందని పురావస్తు శాఖ అసిస్టెంట్ కమిషనర్ స్మితా ఎస్.కుమార్ అప్పుడు వివరణ ఇచ్చారు. అయితే ఈ సమస్య పరిష్కారం కోసం సందులు వచ్చిన రాళ్లను కలుపుతూ వాటిని పోలిన రాళ్లను ఏర్పాటుచేయాలని యోచించారు. రూ.16లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏపీలో అనంతపురం వద్ద రామప్పకు సరిపోలే రాళ్లను గుర్తించి వాటిని తెప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే మరమ్మతు పనుల్లో జాప్యం కారణంగా వర్షం కురిసినప్పుడల్లా పైకప్పు నుంచి నీరు కారుతోంది. చివరిసారిగా 2015-16లో డంగుసున్నం, కరక్కాయ, ఇటుకలు, నల్లబెల్లం మిశ్రమంతో పైకప్పుకు మరమ్మతు చేశారు. 800 ఏళ్లనాటి ఈ పురాతన రాతికట్టడం పటిష్టతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు లభించినా పునరుద్ధరణ, పరిరక్షణ చర్యలలో నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సీపీ

వరంగల్ క్రైం, జూలై 20: రెండు రోజులుగా కమిషనరేట్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా సహాయక చర్యలు అందించేందుకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో ఆదేశించారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో వాగులు, చెరువుల నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైసిటీస్ పరిధిలో, గ్రామాల పరిధిలో గతంలో ముంపునకు గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షాలకు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలకు సహాయక చర్యలు అందించేందుకు ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేయాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు అంబర్ కిషోర్ ఝా సూచించారు.

ఆహా ఏమి రుచి..

నగరంలో టిఫిన్స్‌కు పెరుగుతున్న క్రేజ్

హనుమకొండ టౌన్, జూలై 20: వరంగల్, హనుమకొండ, కాజీపేట (ట్రైసిటీ)లో అడుగు అడుగునా ఉన్న టిఫిన్ సెంటర్లకు ఆదరణ పెరుగుతున్నది. నాణ్యత, రుచి, కస్టమర్ల పట్ల మర్యాద తీరు, వివిధ రకాల వంటకాలతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రధానంగా హనుమకొండ చౌరస్తాలోని పప్పు పూరి, అలంకార్ నెయ్యి ఇడ్లీ, కేయూ క్రాస్‌లో సాంబర్ ఇడ్లీ, ఏకశిలాపార్కు ఎదుట వడ, బొండ, అంబేద్కర్ జంక్షన్, తిరుమల బార్, బొక్కలగడ్డ బ్రిడ్జి, లక్ష్మీ టాకీస్, చౌర్‌బౌళి, చింతల్‌బ్రిడ్జి, బట్టలబజార్ వెంకటేశ్వర టెంపుల్, హంటర్‌రోడ్డు, కాజీపేట బాపూజీనగర్‌బ్రిడ్జి ఏరియాల్లో ఉన్న టిఫిన్ సెంటర్‌లల్లో దొరికే టిఫిన్స్ రుచిగా ఉంటాయని టిఫిన్‌ప్రియులు అంటున్నారు.

ఉరుకులు.. పరుగులు..

ప్రస్తుత జీవనం ఉరుకుల పరుగుల మీద నడుస్తోంది. క్షణం తీరికలేని పనులతో చాలామంది తమ జీవితాలను బీజీగా గడుపుతున్నారు. ఇంట్లో పనులు చేసుకునేందుకు వీలు లేనంతగా పొద్దున నిద్రలో నుంచి లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఎవరిపనుల్లో వారు విరామం లేకుండా నిమగ్నమై పోతున్నారు. అలాగే ఉద్యోగరిత్యా సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులకు ఆ సమయానికి ఇంట్లో టిఫిన్ తయారీ కాకపోవడం సమస్యగా మారింది. దీంతో ఇంట్లో తినలేకపోతున్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి చదువు, ఉద్యోగాల కోసం నగరానికి వచ్చి రూమ్‌లల్లో ఉంటున్న బ్యాచ్‌లర్స్‌కు చాలా మంది బయటదొరికే టిఫిన్ సెంటర్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా వరంగల్ నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నవారు.. నగరం నుంచి వెళుతున్న వారు నిత్యం వేలల్లో ఉంటారు. ఈ క్రమంలో తమ తమ గమ్యస్థానాలకు చేరడానికి, బస్సు, రైళ్లను, వివిధ ప్రైవేటు వాహనాలను అందుకోవడానికి ఇంట్లో నుంచి హడావుడిగా బయలు దేరుతుంటారు. ఈ ఆదరాబాదరాలో ఇంట్లో అల్పాహారం తీసుకోరు. ఈ క్రమంలో నగరంలో అడుగుకొక్కటి వెలసిన టిఫిన్ సెంటర్లలో బ్రేక్ ఫాస్ట్ కానిస్తున్నారు.

రాత్రిళ్లలో కూడా..

రాత్రి వేళల్లో సైతం టిఫిన్ సెంటర్ల జోరు కనిపిస్తుంటుంది. విద్యార్థులు, ఉద్యోగులే కాకుండా కొందరు కుటుంబసమేతంగా బయటికొచ్చి రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్ బండ్ల వద్ద తినడం షరా మామూలైపోయింది. ఇక రాత్రి వేళల్లో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లల్లో ప్రయాణికులకు అక్కడే దొరికే బ్రెడ్ ఆమ్లెట్, వేడి వేడి ఇడ్లీలను ఆహారంగా తీసుకొని ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికులు ఒక్కరే కాదు.. పార్టీలు చేసుకొని అర్ధరాత్రి ఫుడ్ కోసం బయటకొచ్చే యువకులకు సైతం వేడివేడిగా దొరికే ఇడ్లీతో పాటు రైల్వేస్టేషన్‌ల సమీపంలో అర్ధరాత్రి దొరికే బ్రెడ్ ఆమ్లెట్‌ను ఇష్టపడి తింటున్నారు. ముఖ్యంగా హనుమకొండ చౌరస్తాలో అర్ధరాత్రి వరకు దొరికే చిన్న సైజ్ ఇడ్లీ ఫేమస్. చౌరస్తా చుట్టూరా ఆస్పత్రుల్లోని రోగులు, వారి బంధువులు, అర్ధరాత్రి బస్సు దిగొచ్చిన కుటుంబాలకు, బ్యాచిలర్స్‌కు చిన్న ఇడ్లీలే పరమాన్నం.

తృణధాన్యాలు వైపు..


కొంతమంది ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తృణ ధాన్యాలు (మిల్లెట్స్) టిఫిన్స్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. అవి ఎక్కడ ఉన్నా తెలుసుకొని మరీ దూరమైనప్పటికి వెళ్లి తిని వస్తున్నారు. మరి కొంత మంది రుచులు చూడటానికి సైతం సందర్శించి తినేసి వస్తున్నారు. టిఫిన్ ప్రియుల అభిరుచుల తగ్గట్టుగా నగరంలో మిల్లెట్స్ టిఫిన్ సెంటర్స్ పెరిగి పోతున్నాయి. రాగి, సామలు, కొర్రలు, క్యారెట్‌లతో ఇడ్లీ, దోశ, పూరీలు చేసి వేడి వేడిగా అందిస్తున్నారు.

వాకర్స్ కోసం..

మార్నింగ్ వాక్‌లోనే రాగి, కొర్రలు, సామలతో తయారుచేసిన జావను టిఫిన్‌గా తీసుకొని రోజువారీ పనిలో భాగంగా ఎవరి పనులకు వారు వెళుతున్నారు. ప్రతీ గ్రౌండ్‌లో వాకింగ్‌కు ముందు ఈ జావాలు తీసుకోవడం సాధారణమైపోయింది. అయితే పబ్లిక్‌గార్డెన్ దగ్గర బొక్కలనూప్‌కు ప్రత్యేకత ఉంది. వివిధ పనుల కోసం పొద్దునే బయటికి వచ్చే వారితో పాటు వాకర్స్ దానినేబ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటున్నారు.

ఉదయాన్నే డ్యూటీకొస్తా..


ఈ.మాధవ్‌రావు, ట్రాఫిక్ పోలీస్



ఉదయం 8గంటల వరకు విధుల్లో చేరాలి. 7.40నిమిషాలకు పోలీస్‌స్టేషన్‌లో రూల్‌కాల్ ఉంటుంది కాబట్టి ఉదయాన్నే ఇంట్లో నుంచి డ్యూటీకి బయలుదేరుతాను. ఆ సమయంలో ఇంట్లో టిఫిన్ సిద్ధం కాదు. రూల్ కాల్ తర్వాత లేదా కొంత సమయం తర్వాత డ్యూటీ చేసే సిగ్నల్ పాయింట్ దగ్గర ఉన్న ఏదో ఒక టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేస్తాను.

ఇంట్లో టిఫిన్ చేసే సమయం ఉండదు..

రాచమల్ల రవీందర్, బిల్డర్



వృత్తిరిత్యా బిల్డర్ కావడంతో ఉదయాన్నే పని వాళ్లు వచ్చేలోపు నిర్మాణ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. పక్క జిల్లాలో పనులు ఉంటే ఇంట్లో నుంచి ఉద యం 8గంట లకే అక్కడికి బయలు దేరుతాను. మధ్యాహ్న భోజనం తీసుకెళతా.. టిఫిన్ మాత్రం మార్గమధ్యలో చేస్తా..

రోజూ బయటనే టిఫిన్ చేస్తా..

మాడిశెట్టి శ్రీను. ప్రైవేట్ ఉద్యోగి

వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తాను. రోజూ గీసుగొండ మండలం నుంచి బైకుపై వస్తుంటాను వ్యవసాయ కుటుంబం కావడంతో ఇంట్లో టిఫిన్స్ చేయరు. పొద్దున్నే అన్నం వండటంతో లంచ్‌బాక్స్‌తో బయలుదేరుతాను. ఉదయం వరంగల్‌లో టిఫిన్ చేస్తాను. లక్ష్మీటాకీస్ సమీపంలో బోండా భలే రుచిగా ఉంటుంది.

మంచం పట్టిన నేలవంచ


నేలవంచ నుంచి 108 వాహనం ద్వారా రోగులను జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- విషజ్వరాలతో ఆదివాసీలు, గిరిజనులు విలవిల
- 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలింపు

గూడూరు, జూలై 20 : మండలంలోని మట్టెవాడ ఏజెన్సీ గ్రామ పంచాయతీ శివారు నేలవంచలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కొద్దిరోజుల నుంచి ఇంటికొకరు చొప్పున మంచం పట్టారు. ఆ గ్రామానికి వెళ్లాలంటే కనీస రవాణా సౌకర్యం ఉండదు. గుట్ట ఎక్కి దిగాల్సిందే. బురదమయమైన రోడ్డే దిక్కు. అత్యవసర పరిస్థితుల్లో నేలవంచ నుంచి గూడూరు, మహబూబాబాద్‌కు రావాలంటే అనేక ఇబ్బందులు పడాల్సిందే. ఈ క్రమంలో శనివారం విషజ్వరాలతో అనారోగ్యంపాలైన ఆదివాసీ గిరిజనులు 108 వాహనానికి సమాచారం అందించారు. అక్కడికి వెళ్లిన సిబ్బంది రవి, అనిల్ నేలవంచకు చేరుకొని సుమారు 10 మంది జ్వరపీడితులను వాహనంలో ఎక్కించుకొని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదిలావుంటే గతంలో నేలవంచ గ్రామానికి చెందిన మహిళ పురుటినొప్పులతో ఇబ్బంది పడుతుండగా జోలకట్టి పీహెచ్‌సీకి తీసుకెళ్లిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం విదితమే. నాటి నుంచి నేటి వరకు నేలవంచనకు రవాణా మెరుగుపడ లేదు. ఇప్పటికైనా నేలవంచకు సరైన రహదారి నిర్మించి తమను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్కూళ్ల బలోపేతంలో భాగస్వాములు కావాలి

- విద్యార్థుల తల్లిదండ్రులకు డీఈవో రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 20 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సూచించారు. శనివారం జిల్లాలోని అన్నిప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు (పీటీఎం) నిర్వహించారు. ఈ సమావేశాల్లో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారులు, నోడల్, కాంప్లెక్స్‌ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా దంతాలపల్లి మండలం దాట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎంల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో వివరిస్తూ, స్కూళ్లల్లో వారి నమోదును పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సర్కార్ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, రాగిజావ, మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని, ఉన్నత విద్యనభ్యసించి జీవితంలోస్థిరపడేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా సెక్టోరియల్ అధికారులు విజయకుమారి, సంతోష్, ఎంఈవో శ్రీదేవి, కాంప్లెక్స్ హెచ్ఎంవేణు మాధవరెడ్డి, ఏపీసీ చైర్మన్ కొత్త ఎల్లమ్మ, హెచ్ఎంలు. కె.కృష్ణయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


దాట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

సీరోలు మండలం మన్నెగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సెక్టోరియల్ అధికారులు ఆజాద్ చంద్రశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు. మానుకోట మండలం మాధవాపురం జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం సంకా బద్రినారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కంబాలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం రమేష్‌బాబు నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శిభారాణి, తిరుపతి, పేరెంట్స్ సుధాకర్, జనార్దన్‌రెడ్డి, మమత, విజయలక్ష్మీ, రజిత పాల్గొన్నారు. శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దాశరథి శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెంకన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలి

- నర్సింహులపేట : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో రామారావు అన్నారు. మం డలం పరిధిలోని కేజీబీవీ విద్యాలయంను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. మరుగుదొడ్లను, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల వ్యక్తిగత సమస్యలు, నెలకొన్న సమస్యల తెలుసుకొనేందుకు నర్సింహులపేట హైస్కూల్‌కు చెందిన ముగ్గురు మహిళా ఉపాధ్యాయులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై సలహాలు సూచనలు ఇచ్చారు. నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు బాలికలు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కేజీబీవీలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రణాళికను పభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినెటర్ సంతోష్, ఎస్‌వో స్వప్న, 'ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

- ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వాహనం సీజ్

సీరోలు, జూలై 20 : మండలంలోని కాంపల్లి శివారు పలుకుబోడు తండా వద్ద వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 7.5 క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌రాంకుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కాంపల్లి శివారు పలుకుబోడు తండా వద్ద శుక్రవారం రాత్రి వాహనంలో నల్లబెల్లం, పటికను అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు చేసి.. వాహనం, నలబెల్లం, పటికను స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మహబూబాబాద్ సుందరయ్యనగర్ కాలనీకి చెందిన రవి, రాజేందర్, రవి, భద్రులు నల్లబెల్లం, పటికను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో రవి, రాజేందర్‌ను అదుపులోకి తీసుకోగా రవి, భద్రులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులతో పాటు సీసీ పోలీసులు కూడా పాల్గొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాంకుమార్ తెలిపారు.


పట్టుబడిన నల్లబెల్లం, పట్టికను స్వాధీనం చేసుకుని, నిందితులను చూపుతున్న ఎస్సై విజయ్‌రాంకుమార్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున

గూడూరు, జూలై 20 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. గూడూరు మండలం భూపతిపేట పరిధిలోని కారంపొడితండా, శ్రీహనుమాన్‌తండాల్లో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 76మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఐదుగురు జ్వరపీడితుల నుంచి రక్తన మూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. రోగులకు ఉచితంగా మందులు అందించారు. అనంతరం వైద్య, జీపీ సిబ్బందితో కలిసి ఇంటింటా ఫివర్‌సర్వే నిర్వహించారు. ఇండ్లలో ఉన్న లార్వాను గుర్తించి, డ్రైడే నిర్వహించారు. తాగునీటిని వేడిచేసి చల్లార్చిన తర్వాత వడబోసుకుని తాగాలని చెప్పారు. డాక్టర్లు దేవేందర్, నరేష్, హెల్త్ అసిస్టెంట్‌లు సర్దార్‌బాబు, నరేందర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, ఏఎన్ఎం కవిత, స్టాఫ్ నర్సు రజిత పాల్గొన్నారు.

దుర్గమ్మ దేవాలయంలో చోరీ

- 400 గ్రాముల వెండి కిరీటం అపహరణ

కేసముద్రం, జూలై 20 : మండలంలోని ధన్నసరి శివారు సబ్‌స్టేషన్ తండా జీపీ పరిధిలోని దుర్గమ్మ గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గడ్డపారతో గుడికి వేసిన తాళం పగులగొట్టి తలుపులు తెరిచి దుర్గమ్మ విగ్రహంపైనున్న సుమారు 400 గ్రాముల వెండి కిరీటాన్ని అపహరించినట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. కిరీటం విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని తెలుస్తోంది. గుడిలోపల ఏర్పాటు చేసిన హుండీని పగులగొట్టి అందులోని కొన్ని చిల్లర డబ్బులను కూడా ఎత్తుకెళ్లారు. ఉదయం తండావాసులు చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


గుడి వద్ద దుండగులు పగులగొట్టిన హుండీ

గుడుంబా స్వాధీనం, కేసు నమోదు

బయ్యారం, జూలై 20 : చుంచుబంధం తండా, కోయగూడెం గ్రామాల్లో గల గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం రైడ్ నిర్వహించారు. ఈ దాడుల్లో 18 లీటర్ల గుడుంబా స్వాధీనపరుచుకున్నారు. గుడుంబా రవాణకు ఉపయోగిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. గుడుంబా తయారు చేసి రవాణా చేస్తున్న రామ్కి, బాబురావుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ కాలనీలో వ్యక్తి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జూలై 20 : వ్యక్తి అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రం శివారు జగన్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం. బేతోలుకు చెందిన ఎస్‌కె.జానిమియా జగన్ కాలనీలో నివాసముంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 15న పనికి వెళ్లిన జానిమియా సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో జానిమియా భార్య ఎస్‌కె. నజియా టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం

కురవి, జూలై 20 : కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో బెంగుళూరుకు చెందిన శ్రీకాళీవరహి త్రిశక్తి పీఠం శిశ్య బృందం శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శక్తిపీఠం గురువుఆశీస్సులతో దేశంలోని అన్ని చారిత్రక పురాతన ఆలయాలు, శక్తి పీఠాలలో మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు శిశ్య బృందం సభ్యులు తెలిపారు. ఇప్పటికే వారణాసి, అరుణాచలం, శ్రీశైలం, అమరావతి వంటి చారిత్రక ఆలయాల్లో అన్నదానం నిర్వహించినట్లు వెల్లడించారు.

సొసైటీలో రూ.1.23 కోట్ల రుణాల మాఫీ

కొత్తగూడ, జూలై20 :మండలంలోని పొగుళ్లపల్లి సొసైటీలో రూ.1.23కోట్ల రైతుల రుణాలు మాఫీ అయినట్లు టీడీసీఎంఎస్ వైస్ చైర్మన్, సొసైటీ చైర్మన్ దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో నల్లపురి వెంకన్న తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ సొసైటీలో రూ.లక్ష లోపు లోన్ తీసుకున్న 297 మంది రైతులకు పంట రుణాలు రూ.1,23,95,959 లు మాఫీ అయినట్లు చెప్పారు. రుణాలు మాఫీ అయిన రైతులంతా నూతన రుణాల కోసం సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

శబరిమలలో పూజలకు ఎంపికైన స్థానిక తాంత్రి

కేసముద్రం, జూలై20 : శబరిమల అయ్యప్పదేవాలయంలో కేరళ ట్రావెంకోర్ దేవస్వం బోర్డు తరఫున పూజలు నిర్వహించేందుకు కేసముద్రం శ్రీధర్మశాస్త్ర దేవాలయ ప్రధాన తాంత్రి విష్ణు నారాయణపొట్టి ఎంపికైనట్లు ఆల య కమిటీ బాధ్యులు పోలెపల్లి యాకూబ్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరచారి శనివారం తెలిపారు. శబరిమలలో ప్రతీనెల 10 రోజుల పాటు నిర్వహించే పూజా కార్యక్రమాలకు ఇక్కడి తాంత్రి ఎంపిక కావడంపట్ల స్థానిక అయ్యప్పస్వామి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పూజలు నిర్వహిస్తున్న విష్ణునారాయణపొట్టి

రాయల చంద్రశేఖర్ సంతాప సభలు నిర్వహించాలి

- ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న

మహబూబాబాద్ రూరల్, జూలై20 : సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ కన్వీనర్ రాయల చంద్రశేఖర్ సంతాపసభలను ఈ నెల 25వరకు గ్రామ గ్రామాన నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్నపిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాయల చంద్రశేఖర్ ఈనెల 16న ఖమ్మం జిల్లా కేంద్రంలో రైలు ప్రమాదంలో మరణించారని, ఆయన్ను స్మరించుకుంటూ గ్రామ గ్రామాన సంతాపసభలు నిర్వహించి ఈనెల 28న ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి సంతాపసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి. ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం పాల్గొన్నారు.

వినోభానగర్‌లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

బయ్యారం, జూలై 20 : వినోభానగర్‌లో బాలవికాస త్రాగునీటి శుద్ధీకరణ పథకం ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను సంస్థ మేనేజర్ మధుసుదన్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలమోహన్ చేతుల మీదిగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు కొరకు సహకరించిన గ్రామస్థు లను అభినందించారు. ఏటీడబ్ల్యూ విధానంతో మెయింటెనెన్స్ నిమిత్తం 20 లీటర్ల క్యాన్‌కు రూ.5 వసూలు చేయాలన్నారు. పండగలు, పంక్షన్లు, ప్ర యాణాలు ఇలా ప్రతీ సందర్భంలో సురక్షితమైన తాగునీటిని వినియోగించి ఆరోగ్యంగా జీవించాలన్నారు. కాగా, వాటర్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా అందుకు అవసరమగు షెడ్ నిర్మాణం, విద్యుత్ తదితర అవసరాల నిమిత్తం గ్రామస్థులు సుమారు రూ.3 లక్షల విరాళాలు సేకరించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

గూడూరు, జూలై20 : అయోధ్యపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఆయా పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ మండల నోడల్ అధికారి రవికుమార్ శనివారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. వెంకటయ్య సయిద్ అలీ, చంద్రమౌళి, గట్టు వేణు, గోపినాథ్, జగదీష్, రాజు, రమేష్, కోటి పాల్గొన్నారు.

'పారిశుధ్య పనులు చేపట్టాలి'

మరిపెడ రూరల్, జూలై 20 : గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామారావు పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరించారు. శనివారం మండలంలోని అబ్బాయిపాలెం,గాలివారిగూడెం తదితర గ్రామ పంచాయతీలలో ఆయన పర్యటించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామంలో వీధి లైట్లు, సైడ్ కాల్వలను శుభ్రంచేయాలన్నారు. అంతేకాక రహదారి వెంట పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. మంచినీటిని కలుషితం కాకుండా జాగ్రత్త పడాలని, బ్లీచింగ్ పౌడర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

మరిపెడ రూరల్, జూలై 20 : పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి దేవయ్య డిమాండ్ చేశారు. శనివారం తాళ్లపూకల్‌లో కూలీలతో మాట్లాడారు. రెక్కాడితే డొక్కాడని కూలీలు ఎండనక, వాననకా, చలిని భరించి రోజుకు 8 గంటల నుంచి 10 గంటల వరకు కష్టపడుతున్నవారికి కనీసం రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. తప్పెట్ల వెంకటయ్య, వీరమ్మ, రాములమ్మ, చెన్నమ్మ, నరసమ్మ, లక్ష్మణ్, రామన్న, ప్రశాంత్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మట్టేవాడలో కూలిన ఇల్లు


కూలిన సోలం లక్ష్మి ఇల్లు

గూడూరు, జూలై 20 : మట్టేవాడ గ్రామానికి చెందిన సోలం లక్ష్మికి చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి. గత మూడ్రోజులుగాకురుస్తున్న వర్షాలతో ఇంటిగోడ నాని కూలింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఇళ్లు కూలిపోవడంతో తనకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని ఆవేదన వ్యక్తం చేసింది.

ఇల్లు కూలిన బాధిత కుటుంబానికి చేయూత

గార్ల, జూలై 20 : గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుద్దారంలో ఇల్లు కూలిన ఉప్పరపల్లి వెంకటేశ్ బాధిత కుటుంబానికి పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ పరంగా బియ్యంను శనివారం అందజేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దుర్గాప్రసాద్ స్వతంగా ఆర్థిక సహాయం అందజేయగా ప్రభుత్వం పరంగా మండల తహసీల్దార్ కె.రవీందర్ బియ్యం నగదు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు కట్టా శ్రీనివాస్‌రావు, పల్లెబోయిన నాగరాజు, లింగస్వామి, పచ్చిపాల వెంకన్న, వీరస్వామి లశోక్, జక్కుల మహేష్‌యాదవ్, పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు అధికారుల బదిలీ

నెహ్రూసెంటర్, జూలై20 : వైద్య, ఆరోగ్యశాఖలో ఐదుగురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, డీఐవోగా విధులు నిర్వహిస్తున్న అంబరీషను హన్మకొండ ప్రసూతి ఆస్పత్రి ఆర్ఎంగా బదిలీ చేశారు. జిల్లా ఎన్‌హెచ్ఎం ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న బిందుశ్రీ ఖమ్మం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంకు, మహబూబాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సూపరిండెంట్‌గా పని చేస్తున్న రవికుమార్‌ను వరంగల్ ఎంజీఎం ఆఫీస్ సూపరిండెంట్‌గా, సూర్యాపేట జీజీహెచ్ ఆర్ఎంవోగా బదిలీ చేశారు. మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌గా విధులు నిర్వహిస్తున్న కళావతిబాయిని ఖమ్మం జీజీహెచ్ ఆర్ఎంవోగా నియమిస్తూ బదిలీ చేశారు. కాగా, కళావతి బాయి మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌వోగా విధులు నిర్వహించనున్నారు. మహబూబాబాద్ జీజీహెచ్‌గా పనిచేస్తున్న రవికిశోర్‌ను ఖమ్మం జీజీహెచ్ ఆఫీస్ సూపరిండెంట్‌గా బదిలీ చేశారు.

- మహబూబాబాద్ ఎఫ్‌డీవోగా పనిచేసిన కృష్ణమాచారి బదిలీ అయ్యారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా వెళ్లారు. వరంగల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా పనిచేసిన నాగభూషణం నల్గొండకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కృష్ణమాచారి బాదిలీపై వెళ్లారు. కృష్ణమాచారి 2018 నుంచి నేటి వరకు ఆరు సంవత్సరాలుగా మహబూబాబాద్ ఎఫ్‌డీవోగా విధులు నిర్వహించారు. కాగా, జిల్లాలోని ఆరుగురు డీఆర్వోలు, 52 మంది బీట్ ఆఫీసర్లు, ముగ్గురు ఎఫ్ఎస్‌వోలకు స్థన చలనం కల్పించారు.
- మహబూబాబాద్ అగ్రికల్చర్ : జిల్లా నుంచి శనివారం రాత్రి కొంతమంది అధికారులకు బదిలీలు జరిగాయి. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి టి.సుధాకర్ మేడ్చల్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు హన్మకొండకు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రామకృష్ణ కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు.

దంతాలపల్లి మండలానికి కేజీబీవీ మంజూరు

దంతాలపల్లి, జూలై 20 : మండలానికి నూతనంగా 2024-25 సంవత్సరానికిగాను కస్తూర్బాగాంధీ బాలిక పాఠశాల మంజూరైనట్లు ఎంఈవో గుగులోతు రాము పేర్కొన్నారు. శనివారం ఆయన దంతాలపల్లిలో మాట్లాడుతూ 6, 7వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తామన్నారు. దంతాలపల్లి మండలానికి మంజూరైన కేజీబీవీని నర్సింహులపేట మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ భవనంలో ప్రారంభించేందుకు చర్యలుతీసుకున్నామన్నారు. ఈ మార్పును డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ చేసిందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నర్సింహులపేట, జులై 20 : మండల కేంద్రంలో పలువురుకి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బండ భిక్షంరెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింహులపేట, కొమ్ములవంచ, పడమటిగూడెం, పెద్దనాగారం, కౌసల్యదేవిపల్లి గ్రామాల ఐదుగురు లబ్ధిదారులు 2023లో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రత్యేక చొరవతో రూ.1,12,000 ఆర్థిక సాయంను మం జూరు చేయడంతో చెక్కుల రూపంలో బాధితులకు అదజేశామని తెలిపారు. కౌసల్యదేవిపల్లి మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మిరియాల వెంకన్న, పటేల్ రామన్న, మంచినీళ్ల శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ'

నర్సింహులపేట, జులై20 : వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే విద్యుత్ ప్రమాదాల నివారణ సాధ్యమని విద్యుత్ ఏఈ పాండునాయక్ అన్నారు. శనివారం నర్సింహులపేటలో ఆయన మాట్లాడుతూ వర్షాలుపడే సమయంలో తడున్న విద్యుత్ స్తంభాలను, తడి చేతులతో వ్యవసాయ బావుల స్టాటర్లు, మోటర్లను తాకరాదన్నారు. చిన్నారులను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు. ఉతిక బట్టలను ఇనుపతీగలపై ఆరవేయరాదన్నారు. లేని యడల షాట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. లైన్మెన్ మంగీలాల్, హెల్పర్లు సుధాకర్, వెంకన్న ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

తొర్రూరు, జూలై 20 : విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలు కూలంకషంగా తెలుసుకోవాలన్నారు. చెడు విషయాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో జలపాతం హొయలు

- సందడి చేసిన యువత



బయ్యారం, జూలై 20 : రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో బయ్యారం మండలం పెద్దగుట్టు సమీప పాండవుల గుట్ట జలపాతం, చింతోని గుంపు సమీప (మినిబొగత) జలపాతం అందాలు హొయలొలుకుతున్నాయి. కొండపై నుంచి జాలువారుతున్న జలపాతాల వద్ద యువత సందడి చేస్తున్నారు. సమీప ప్రాంతాల నుంచి యువకులు జలపాతాల అందాలు వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

పోలీసుల ఆంక్షలు..

జలపాతాలను సందర్శించే సమయంలో ప్రమాదవశాత్తు పలు దుర్ఘటనలు జరుగుతుండటంతో పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ జారుడు సమస్య తలెత్తె అవకాశముండటంతో ముసురు వీడేంత వరకు జలపాతాలను వీక్షించవద్దని సందర్శకులకు సూచిస్తున్నారు. ఒక వేళ సందర్శించాల్సి వస్తే దూరం నుండే జలపాతాలను వీక్షించాలన్నారు.

మొట్లతిమ్మాపురానికి నిలిచిన రాకపోకలు

- వట్టివాగును సందర్శించిన అధికారులు


వట్టివాగును సందర్శిస్తున్న తహసీల్దార్ సాదియా సుల్తాన

బయ్యారం, జూలై20 : మొట్లతిమ్మాపురం సమీప వట్టివాగుపై నుంచి నీటి ప్రవాహం ఉధృతమవడంతో మొట్లతిమ్మాపురానికి రాకపోకలు నిలిచిపోయాయి. వాగుపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు కాగా, పనులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయిలే బ్రిడ్జి పనులు నిర్మాణ దశలో ఉండటంతో వాగు పైనుంచి వరద ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా.. ఎవరు వాగును దాటకుండా అధికారులు వాగుకు ఇరువైపుల ట్రాక్టర్, కంచె ఏర్పాటు చేశారు. వాగును శనివారం తహసీల్దార్ సాదియా సుల్తాన, సీఐ రవికుమార్, ఎస్సై ఉపేందర్ తదితరులు సందర్శించారు.


గూడూరు మండలంలో జాలువారుతున్న భీమునిపాదం జలపాతం


రామవిలాస్ గల్లీలో నిలిచిన వర్షం నీరు


గార్ల పాకాల వాగు వద్ద బారీకేడ్‌లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు


కొత్తగూడలో ప్రవహిస్తున్న కొత్తపల్లి వాగు

జిల్లాలో 627.8 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్, జూలై20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం రాత్రి పలు మండలాల్లో భారీ వర్షం కురియగా, మరికొన్ని చోట్ల ఓ మోస్తారు వాన కురిసింది. శనివారం ఉదయం 8.30 గంటల వరకు కొత్తగూడలో 26.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గంగారం 38.4 మి.మీ, బయ్యారం 71.0 మి.మీ, గార్ల 60.4 మి.మీ, డోర్నకల్ 54.0 మి.మీ, కురవి 48.2 మి.మీ, మహబూబాబాద్‌లో 49.8 మి.మీ పడింది. గూడూరు 32.0 మి.మీ, కేసముద్రం 27.4 మి.మీ, నెల్లికుదురు 24.4 మి.మీ, నర్సింహులపేట 35.2 మి.మీ, చిన్నగూడూరు 46.4 మి.మీ, మరిపెడ 52.4 మి.మీ, దంతాలపల్లి 20.4 మి.మీ, తొర్రూరు 22.6 మి.మీ, పెద్దవంగర 18.8 మి.మీ వాన కురిసింది. మొత్తం జిల్లా వ్యాప్తంగా 627.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.